సాక్షి
వనపర్తి

శుక్రవారం । 26 । జూలై । 2024



ఏసీబీకి చిక్కిన సర్వేయర్

రైతు నుంచి లంచం తీసుకుంటున్న సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

వివరాలు IIలో ▸



మరింత వరద..

ప్రియదర్శిని జూరాల జలాశయానికి రోజురోజుకు వరద ఉధృతి పెరుగుతోంది.

వివరాలు IIలో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 27.4 /23.2

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. చిరు జల్లులతో పాటు అప్పుడప్పుడు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మెరుగైన ఫలితాలతోనే గుర్తింపు : డీఈఓ



కొత్తకోట రూరల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తేనే గుర్తింపు లభిస్తుందని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు అన్నారు. గురువారం పట్టణంలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు, తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఎంఈఓ కృష్ణయ్య, హెచ్‌ఎం నిర్మలాదేవి, ఉపాధ్యాయ బృందం రాజలక్ష్మి, రాజేశ్వరి, పుష్పవతి, రఘురాంజీ, శ్రీదేవి తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం..

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ గోవిందరాజులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గెస్ట్ సీఆర్టీ హిందీ, గెస్ట్ పీఈటీ, అసిస్టెంట్ కుక్‌లు–2 పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. గెస్ట్ సీఆర్టీ హిందీకి డిగ్రీ, హిందీ పండిట్ పూర్తిచేసినవారు, గెస్ట్ పీఈటీకి డిగ్రీ, బీపీఈడీ, అసిస్టెంట్ కుక్ 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. డెమో ద్వారా ఎంపిక చేస్తామని.. ఆసక్తి గల అభ్యర్థులు పాఠశాలలో ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్పాట్ అడ్మిషన్లు

కొత్తకోట రూరల్: కొత్తకోట సమీపంలోని వీపనగండ్ల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికిగాను ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో మిగిలిన సీట్లకు అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి, 2024లో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 27న కల్వకుర్తి జేపీనగర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

ఆర్టీసీ దుకాణాలకు టెండర్ల ఆహ్వానం

వనపర్తిటౌన్: వనపర్తి ఆర్టీసీ డిపో పరిధిలోని బస్టాండ్‌లలో ఉన్న దుకాణాలకు ఇ–టెండర్, మాన్యువల్, ఆక్షన్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో 'ఓఎస్', 'పీ', 'ఓ' దుకాణాలకు ఇ– టెండర్లు, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత, ఖిల్లా ఘనపురం బస్‌స్టేషన్లలోని 'ఓ' సిరిస్ దుకాణాలకు మాన్యువల్ విధానంలో, వనపర్తి, పెబ్బేరు, ఆత్మకూర్, కొత్తకోట బస్టాండ్‌లోని 'పీ' సిరిస్ దుకాణాలకు ఆక్షన్ విధానంలో టెండర్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇ–టెండర్లు ఆగస్టు 7 వరకు, మాన్యువల్ టెండర్లు ఆగస్టు 5 వరకు, ఆక్షన్ టెండర్లకు 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. టెండర్ వాయిదా వేయడానికి, రద్దు చేయడానికి టెండర్ కమిటీకి పూర్తి అధికారం ఉందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. పూర్తి వివరాలకు సెల్‌ఫోన్ నంబర్లు 94940 19474, 99592 26289, 73828 29092 సంప్రదించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

పెబ్బేరు రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కావాల్సిన అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి డా. బి.శ్రీనివాసులు, డా. సాయినాథ్‌రెడ్డి ఆదేశించారు. గురువారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో వారు మాట్లాడారు. గ్రామాల్లో నీటి నిల్వలున్న ప్రదేశాలను గుర్తించి దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలని, దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టాలని సూచించారు. మాత, శిశు సంరక్షణలో భాగంగా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను గుర్తించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోటీపీ సర్వీసెస్ ఆన్‌లైన్ అప్‌డేషన్ 100 శాతం పూర్తి చేయాలన్నారు. పీఓ డా. ఝాన్సీ, వంశీకృష్ణ, మంజుల, పరిమళ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మోదం.. ఖేదం



పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకే ప్రాధాన్యం

- కల్వకుర్తి ఎత్తిపోతలకు రూ.715 కోట్లు కేటాయింపు
- కోయిల్‌సాగర్, సంగంబండ, నెట్టెంపాడుకు నిధులు
- 'పాలమూరు–రంగారెడ్డి' ప్రాజెక్టుకు మరోసారి నిరాశే.. ఈసారి కేటాయించింది రూ.2 వేల కోట్లు మాత్రమే
- పీయూకి దక్కింది రూ.11.74 కోట్లే
- రాష్ట్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉమ్మడి పాలమూరు జిల్లాకు నిరాశ మిగిల్చింది. సీఎం రేవంత్‌రెడ్డి సొంతజిల్లా కావడంతో భారీగా కేటాయింపులు దక్కుతాయని ఆశించినా.. గురువారం అసెంబ్లీలో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ మోదం, ఖేదం కలిగించింది. కాగా..ఈ బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాలోని పనులు చివరి దశలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులు దక్కాయి. వీటిలో ప్రధానంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, కోయిల్ సాగర్, సంగంబండ, నెట్టెంపాడు ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు అవసరమైన నిధులను కేటాయించారు. ప్రతిష్టాత్మకమైన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు మాత్రం ఆశించిన నిధులు మంజూరు కాలేదు. కాగా..ఈ బడ్జెట్‌పై వివిధ వర్గాలు మిశ్రమంగా స్పందించాయి.

రూ.21 వేల కోట్లకు రూ.2 వేల కోట్లే కేటాయింపు

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తిచేసేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో కేటాయించకపోవడంతో ఈ ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై అనుమానాలు నెలకొన్నాయి. ప్రభుత్వం మొదటి దశలో చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులను పూర్తిచేసేందుకే మొగ్గుచూపినట్టు తెలుస్తోంది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును మొదట రూ. 35,200 కోట్ల వ్యయ అంచనాతో పనులు ప్రారంభించగా, ఈ పనులు కొలిక్కి రాకముందే ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.52,056 కోట్లకు చేరింది.



ఇప్పటివరకు రూ.31 వేల కోట్ల పనులు పూర్తయినట్టు ప్రభుత్వం చెబుతుండగా.. పూర్తిస్థాయి పనులు చేపట్టాలంటే ఇంకా సుమారు రూ.21 వేల కోట్లు అవసరం ఉండగా.. ఈ బడ్జెట్‌లో కేవలం రూ.2 వేల కోట్ల నిధులనే కేటాయించింది.

కల్వకుర్తి ఎత్తిపోతలకే ప్రాధాన్యం..

కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద పెండింగ్‌లో ఉన్న 28, 29, 30 ప్యాకేజీలను పూర్తిచేసేందుకు ఈ బడ్జెట్‌లో రూ.715 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టు పూర్తిచేసేందుకు అవసరమైన మేరకు ప్రభుత్వం నిధులు మంజూరుచేసిందని అధికారులు చెబుతున్నారు. కేఎల్‌ఐ విస్తరణ పనుల ద్వారా అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లో సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందనుంది.



ఎకో టూరిజంగా నల్లమలపై దృష్టి..



రాష్ట్రంలోని ఏడు టూరిజం సర్క్యూట్ల పరిధిలో ఎకో టూరిజం అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో నల్లమలలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ను ఎకో టూరిజంలో భాగంగా అభివృద్ధి చేయనున్నట్టు బడ్జెట్‌లో ప్రస్తావించింది. రాష్ట్రవ్యాప్తంగా అడవులు, పర్యావరణం కోసం రూ.1,064 కోట్లు దక్కగా వీటిలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో అవసరమైన ప్రతిపాదనల మేరకు నిధులను కేటాయించనున్నారు.

❒ ఉమ్మడి జిల్లాలోని పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధి, నిర్వహణకు ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 11.74 కోట్లను కేటాయించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కోసం ఇతోధికంగా నిధులు కేటాయించడంతో గ్రామపంచాయతీలకు అవసరమైన నిధులు వస్తాయన్న ఆశలు నెలకొన్నాయి.

కోయిల్‌సాగర్, సంగంబండ ప్రాజెక్టులకు కేటాయింపులు..



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద పెండింగ్ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.187.95 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో కేటాయింపులు దక్కడంతో పెండింగ్‌లో ఉన్న దేవరకద్ర గ్రావిటీ కెనాల్, ఎడమ కాల్వ, డిస్ట్రిబ్యూటరీ కాల్వల పనులు పూర్తికానున్నాయి. భీమా ఎత్తిపోతల విస్తరణ పనుల్లో భాగంగా సంగంబండ ప్రాజెక్టు పనులకు రూ.602.76 కోట్లను కేటాయించింది. ఈ ప్రాజెక్టు కింద ఇప్పటికే సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్ల నిర్మాణం పూర్తికాగా, ఇప్పుడు పెండింగ్ పనులు, కాల్వల నిర్మాణాన్ని పూర్తి చేయనున్నారు. తాజా బడ్జెట్‌లో వనపర్తి జిల్లా పరిధిలో పెండింగ్‌లో ఉన్న నెట్టెంపాడు ఎత్తిపోతల పనులకు రూ.104.75 కోట్లు, భీమా ఎత్తిపోతలకు రూ.83.44 కోట్ల కేటాయింపులు దక్కాయి.

వీటికి కేటాయింపులు నిల్..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలకు ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు దక్కకపోవడంతో ఆయా పథకాల అమలు ప్రశ్నార్థకంగా మారింది. ప్రధానంగా దళిత బంధు, కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రీషన్ కిట్, కంటివెలుగు, గొర్రెల పంపిణీ పథకాలకు బడ్జెట్‌లో అవసరమైన కేటాయింపులు దక్కలేదు. కల్యాణలక్ష్మి పథకానికి అదనపు నిధులు కేటాయించకపోవడంతో రూ.లక్షకు అదనంగా తులం బంగారం నజరానాపై అనుమానాలు నెలకొన్నాయి.

అన్ని రంగాలకు సమన్యాయం..



రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయం, మహిళా సంక్షేమానికి పెద్దపీట వేయడం హర్షణీయం. ఒక్క వ్యవసాయ రంగానికే రూ.72.659 కోట్ల కేటాయింపుతో ఎంతో మేలు చేకూరనుంది. పదేళ్ల అస్తవ్యస్త పాలన తర్వాత ఆశించిన అభివృద్ధికి తొలి బడ్జెట్ దోహదపడనుంది. అన్ని ప్రాధాన్య రంగాలకు సమన్యాయం చేస్తూ.. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా రాష్ట్ర బడ్జెట్ ఉంది. ప్రజాపాలనకు ఇదొక ఉదాహరణ.

– తూడి మేఘారెడ్డి, ఎమ్మెల్యే, వనపర్తి

దశ, దిశ లేదు..



కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారి దశ, దిశ లేని బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. మహిళలకు రూ.2,500, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా, నిరుద్యోగులకు రూ.4 వేల భృతి, రైతుకూలీలు, కౌలు రైతుల ప్రస్తావనే లేదు. రాష్ట్రంలోని సబ్బండ వర్గాల ఆశల మీద నీళ్లు చల్లినట్లుగా బడ్జెట్ ఉంది. ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టిన విధానం రాజకీయ ప్రసంగంలా కొనసాగింది. ప్రధాన సంక్షేమ పథకాల ప్రస్తావనే రాలేదు.

– సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రి

నిరాశే మిగిలింది..



సీఎం సొంత జిల్లా పాలమూరుకు బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు ఉంటాయనుకున్నాం గానీ నిరాశే మిగిలింది. పాత పథకాలను కొత్తగా చూపించినట్లుగా బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇచ్చామని చెప్పుకొంటూనే.. బోనస్ ప్రస్తావన తీసుకురాలేదు. ఇదివరకే ఉన్న పథకాలను కొత్తగా ప్రస్తావించారు.

– గట్టుయాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

అంకెల గారడీ..



రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీగా, రాజకీయ ప్రసంగంలా కొనసాగింది. సరైన దిశా నిర్దేశం, హామీల అమలుపై చిత్తశుద్ధి లోపం, బడ్జెట్ నిండా అప్పులే కనిపించాయి. రూ.62 వేల కోట్ల భారీ అప్పుచేసి అభివృద్ధికి వెచ్చిస్తుంది కేవలం రూ.33 కోట్లుగా చూపించారు. పింఛన్ల పెంపు, నిరుద్యోగ భృతికి ప్రత్యేక కేటాయింపులు లేవు. పారిశ్రామిక రంగానికి ఆశించిన ప్రాధాన్యం కల్పించలేదు.

– డి.నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

వాస్తవిక బడ్జెట్..



ప్రజల ఆకాంక్షలు, రాష్ట్రాభివృద్ధి, పేదల సంక్షేమాన్ని సమన్వయం చేసుకుని బడ్జెట్ రూపొందించారు. అంకెల గారడీ కాకుండా వాస్తవ లెక్కలతో రూపొందించిన ఆరు గ్యారంటీల హామీ పత్రం ఈ బడ్జెట్. రూ.72,659 కోట్లు వ్యవసాయ రంగానికే కేటాయించారు. రుణమాఫీకి రూ.31 వేల కోట్లు కేటాయించడం చూస్తే సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతిగా రైతును రాజును చేసే దిశగా బడ్జెట్ ఉంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలి వాస్తవిక బడ్జెట్ ఇది.

– జి.మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే, దేవరకద్ర

అన్ని వర్గాలకు పెద్దపీట



బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సముచిత న్యాయం కల్పించింది. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాముఖ్యత ఇవ్వడం జరిగింది. పేదల సంక్షేమంలో భాగంగానే ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ, రైతుభరోసా, మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం, రూ.500 లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలకు ప్రభుత్వం పెద్దపీట వేసింది.

– వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే, మక్తల్

కౌలు రైతులకూ భరోసా..

రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి అత్యధికంగా నిధులు కేటాయించడంతో పాటు రైతుభరోసా, రైతుబీమా, పంట రుణమాఫీ పథకం, సన్నరకం వరికి రూ.500 బోనస్ ధర కోసం నిధులు కేటాయించింది. అలాగే ఈసారి బడ్జెట్‌లో వ్యవసాయకూలీలకు సైతం ఆర్థిక సాయం కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో కౌలురైతుల్లో ఆశలు నెలకొన్నాయి. గృహజ్యోతి పథకం కింద రూ.200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ. 500 గ్యాస్ సిలిండర్, ఆసరా పెన్షన్లు, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు అందించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. గురుకుల స్కూళ్లకు నిధులను కేటాయించడంతో పాటు జిల్లాల్లోని అన్నిరకాల గురుకుల రెసిడెన్షియల్ స్కూళ్లను ఒకేచోట నిర్మించి అన్ని రకాల వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొంది.

అన్ని వర్గాలకు సంక్షేమం..



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం నిధులను కేటాయించింది. ప్రధానంగా వ్యవసాయం, రైతుసంక్షేమం, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇచ్చాం. ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయించింది. నల్లమలలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ను ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

– జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

వనపర్తి: వానాకాలం సీజన్‌ను దృష్టికిలో ఉంచుకొని జిల్లాలోని పురపాలికలు, గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. గురువారం వనపర్తి పట్టణం, పాన్‌గల్ మండలాల్లో ఆయన పర్యటించారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లోని ఖాళీ ప్లాట్లలో పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించుకునేలా యజమానులకు సూచించాలన్నారు. లేనిపక్షంలో ప్లాట్ల యజమానులకు జరిమానా విధించి పుర పారిశుద్ధ్య విభాగం అధికారులు శుభ్రం చేయించాలని ఆదేశించారు. డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తూ మురుగు నిల్వకుండా చూడాలన్నారు. పాన్‌గల్ మండలం గోప్లాపూర్ ప్రభుత్వ పాఠశాల, రేమద్దుల జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి వారి సామర్థ్యాలను పరీక్షించారు. గోప్లాపూర్ నర్సరీని సందర్శించి వన మహోత్సవానికి అందించే మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాన్‌గల్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు, ఓపీ రిజిస్టర్లను పరిశీలించారు. ఔషధాల నిల్వలపై సిబ్బందితో ఆరా తీశారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ధరణి దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా పరిష్కరించి ఆర్డీఓ లాగిన్‌కు పంపించాలని ఆదేశించారు. ఆయన వెంట డీఆర్డీఓ ఉమాదేవి, మండల అధికారులు ఉన్నారు.



పాన్‌గల్ పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

వనపర్తిటౌన్: అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని ఏఎస్పీ రాందాస్ తేజావత్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపోలో గురువారం ప్రమాద రహిత వారోత్సవాల ప్రారంభానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీలో ప్రమాదాలకు తావు ఇవ్వొద్దనే సిబ్బందిని సుశిక్షితులుగా తీర్చిదిద్దేందుకు వారోత్సవాలు నిర్వహిస్తోందని చెప్పారు. సరైన విశ్రాంతి, ఆరోగ్యంపై శ్రద్ధ వాహన చోదకులకు అవసరమని తెలిపారు. వాహనం నడిపే సమయంలో మన కుటుంబంతో పాటు ఎందరో జీవితాలు మన చేతుల్లో ఉన్నాయనే విషయం మరువొద్దని వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ఫోన్‌లో మాట్లాడటం, కబుర్లు పెట్టడం సరైంది కాదని హెచ్చరించారు. డ్రైవర్లు, కండక్టర్లు పరస్పరం అవగాహన కలిగి ఉండాలన్నారు. డిపో మేనేజర్ వేణుగోపాల్, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ రాందాస్ తేజావత్

'కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీరని ద్రోహం'

పెబ్బేరు రూరల్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణాకు నిధుల కేటాయింపుల్లో వివక్షకు నిరసనగా గురువారం సీపీఎం వనపర్తి పట్టణ కమిటీ అధ్యక్షుడు కురుమయ్య ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో విభజన హామీల ఊసే లేదని, వ్యవసాయ, పారిశ్రామిక, ఉత్పత్తి రంగాల ప్రాధాన్యతను తగ్గించడంతో పాటు నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఎలాంటి ప్రాధ్యాన్యం ఇవ్వలేదని తెలిపారు. బడ్జెట్ కేవలం ఎన్డీఏ భాగస్వామ్యపక్షాలను సంతృప్తిపర్చే విధంగా ఉందని విమర్శించారు. బీజేపీ బడ్జెట్ తీరు సిగ్గు సిగ్గు అంటూ నినాదాలు చేశారు.

హామీల అమలుపై దృష్టి సారించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్

పాన్‌గల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చే అంశాలు లేకపోవడం రాష్ట్రాన్ని విస్మరించడమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పంట రుణమాఫీ గందరగోళంగా తయారైందని.. చాలా మంది రైతుల పేర్లు రూ.లక్షలోపు రుణమాఫీ జాబితాలో లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యలు గుర్తించి పరిష్కారానికి వారితో కలిసి నిరంతరం పోరాటాలు కొనసాగించాలని.. పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని సభ్యులు, కార్యకర్తలకు సూచించారు. ఈ నెల 29న పార్టీ జిల్లా సమావేశం ఉంటుందని.. జిల్లాలోని పలు సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి బాల్యానాయక్, రాము, వెంకటయ్య, భగత్, జంబులయ్య, భీమయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్.. హాజరైన ఇతర నాయకులు

కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి

జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి

వనపర్తిటౌన్: విద్యార్థులు కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహంలో జిల్లా మహిళ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొత్త చట్టాలను తీసుకొచ్చిందని, మేధావులు, విద్యావంతులు, న్యాయ నిపుణులు కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. పోక్సో చట్టాల గురించి వివరించారు. తెలియని వ్యక్తులతో మాట్లాడటం, ఫోన్‌లో చాటింగ్‌లు చేయవద్దని, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల బారిన పడితే 1930, 1098, 18110014568 నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అంతకుముందు వైద్యాధికారి డా. వైష్ణవి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని, వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వసతిగృహ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వసతిగృహ సంక్షేమ అధికారి జీవితకు సూచించారు. కార్యక్రమంలో మహిళ సాధికారిక కేంద్రం బృందం భాస్కర్, శ్రీవాణి, సలోమి, సుమ, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

మాగనూర్: మండలంలోని అడవిసత్యారం సమీపంలో ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ అబ్దుల్‌ఖాదర్ తెలిపిన వివరాల ప్రకారం.. కేటీదొడ్డి మండలానికి చెందిన దొబ్బ ఈరప్ప(55) బుధవారం అడవిసత్యారం చెందిన రైతు అంజప్ప వద్ద కూలీ నిమిత్తం వచ్చాడు. అయితే అదే రోజు ఉదయం 10 గంటల సమయంలో ట్రాక్టర్ ట్రాలీలో వరినాట్లతో వెళ్తుండగా డ్రైవర్ అంజప్ప అజాగ్రత్తగా ట్రాక్టర్ నడపడం వలన, ట్రాక్టర్‌పై నుంచి కిందపడి తలకు గాయమైంది. దీంతో అతడిని మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం రాయచూర్ తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి 8 గంటలకు మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కూమారుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పరీక్షలో ఫెయిలై విద్యార్థి ఆత్మహత్య

మానవపాడు: పరీక్షలో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురై ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ చంద్రకాంత్ కథనం ప్రకారం... అమరవాయికి చెందిన బి. కౌశిక్(21) బీఎస్సీ చదువుతున్నాడు. కాగా మొదటి సంవత్సరం(అనస్తీషియా)లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 23న మంగళవారం ఉదయం తమ గేదెల షెడ్డు దగ్గరికి వెళ్లి అక్కడ ఉన్న గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం అతడు మృతిచెందాడు. కాగా అతడి తండ్రి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

మృతురాలి వివరాలు లభ్యం

అచ్చంపేట రూరల్: అచ్చంపేట పట్టణంలోని మల్లంకుంట వద్ద బుధవారం నీటి గుంతలో పడి మృతిచెందిన మహిళ వివరాలు లభించినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం తిరునంపల్లికి చెందిన మండ్ల అడివమ్మ (40) ఇటీవల అచ్చంపేటలోని బంధువుల ఇంటికి వచ్చింది. బుధవారం స్థానిక మల్లంకుంట ఎదురుగా ఉన్న ఓ నీటి గుంతలో పడి ఆమె మృతిచెందింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మహిళ మృతదేహం లభ్యంపై అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించారు. ఈక్రమంలో గురువారం అడివమ్మ బంధువులు అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వివరాలను తెలియజేశారు. మృతురాలికి సంబంధించి అన్ని వివరాలు, ఆధారాలు సేకరించిన అనంతరం మృతదేహాన్ని అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదు.

ఇద్దరు యువకుల అరెస్ట్

260 గ్రాముల ఎండు గంజాయి సీజ్

మహబూబ్‌నగర్ క్రైం: ఓ ఇంటి సమీపంలో ఎండు గంజాయి తాగుతున్న ఇద్దరు యువకులను గురువారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి కథనం మేరకు.. జిల్లాకేంద్రంలోని ఏనుగొండ సమీపంలో ఉన్న వివేకానందకాలనీలో ఓ ఇంటి దగ్గర ఎండు గంజాయి నిల్వ ఉండడంతో పాటు తాగుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. గంజాయి తాగుతున్న వేణు, ప్రకాష్‌ను అదుపులోకి తీసుకొని ఇంట్లో తనిఖీలు నిర్వహించగా 260 గ్రాములు ఎండు గంజాయి పట్టుబడిందని వివరించారు. ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఎవరైనా గంజాయి తాగుతున్నట్లు, నిల్వ చేసినట్లు సమాచారం అందితే సెల్‌నంబర్ 8712658872 ఫిర్యాదు చేయాలని వివరించారు. తనిఖీల్లో ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది కళానందం, వేణుగోపాల్, వినోద్‌కుమార్, సుధారాణి, రమేష్ పాల్గొన్నారు.

చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించాలి

పాలమూరు: వర్షాకాలం నేపథ్యంలో చిన్నారులకు అందిస్తున్న ఆహారం నాణ్యతగా ఉండాలని, తాగునీరు పరిశుభ్రంగా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని స్టేట్ హోం, శిశు గృహ, చిల్డ్రన్ హోంను గురువారం న్యాయమూర్తి సందర్శించారు. అక్కడ చిన్నారులకు అందుతున్న వసతి, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. స్థానికంగా ఉన్న చిన్నారులతో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. వర్షాకాలంలో పిల్లలు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంటుందని, వారి ఆరోగ్యంపై కూడా జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు చేసి పోక్సో, లీగల్ సర్వీసెస్ యాక్ట్, బాల్య వివాహాలు, బాలల విద్య, బాలల హక్కులపై అవగాహన కల్పించారు.

జూరాలకు మరింత పెరిగిన వరద



జూరాల ప్రాజెక్టు వద్ద దిగువకు విడుదలవుతున్న వరద

- ప్రాజెక్టుకు 2,27,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 46 క్రస్టు గేట్ల ఎత్తివేత
- జల విద్యుత్ కేంద్రంలో 11 యూనిట్లలో విద్యుదుత్పత్తి

ధరూరు: మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద మరింత పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. జూరాలకు 6 రోజులుగా వరద రాక ప్రారంభం కాగా, ఇన్‌ఫ్లోలు పెరుగుతూ వస్తుంది. వచ్చిన నీటిని విద్యుదుత్పత్తికి వినియోగించుకోవడంతో పాటు మిగిలిన జలాలను క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. గురువారం ప్రాజెక్టుకు 2.27లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు 46 క్రస్టు గేట్లను 2,25,354 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉండగా జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో 11 యూనిట్లను కొనసాగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 19,516 క్యూసెక్కుల నీటిని వినియోగించు కుంటున్నారు. ఆవిరి రూపంలో 38, కుడి కాల్వ ద్వారా 453, ఎడమ కాల్వకు 820, నెట్టెంపాడుకు 750, భీమా లిఫ్టు–1కు 1,300, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,48,231 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 6.065 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగినట్లు అధికారులు తెలిపారు. 2,04,267 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, ప్రాజెక్టు నుంచి 2,75,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 86.08 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు సైతం ఇన్‌ఫ్లో పెరిగినట్లు అధికారులు చెప్పారు. ప్రాజెక్టుకు 2.70లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు వద్ద 25 గేట్లను 2,70,120 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 33.313 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 26.584 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

51ఎం.యూ. విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతుంది. గురువారం 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు జెన్‌కో ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు ఉత్పత్తిని చేపడుతున్నారు. ఇప్పటివరకు 51.4 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు.

నిండిన రామన్‌పాడు

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో గురువారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 827 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 800 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు.

శ్రీశైలంలో 855.2 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో గురువారం 855.9 అడుగుల నీటిమట్టం, 94.238 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల నుంచి 2,46,965 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలంకు వస్తున్నాయి. భూగర్భ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 31,784 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 143 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోశారు. జలాశయంలో 78 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

తుంగభద్ర డ్యాంకు జలకళ

శాంతినగర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కర్ణాటక పరిధిలో నిర్మించిన తుంగభద్ర డ్యాం పూర్తి స్థాయి నీటిమట్టంతో జళకళను సంతరించుకుంది. దీంతో జలాశయ పరీవాహక ప్రాంత ప్రజలు, ఆర్డీఎస్ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ డ్యాం నిండితేనే తుంగభద్ర నదికి నీటిని విడుదల చేస్తారు. నదిలో ప్రవాహం ఉంటేనే ఆర్డీఎస్ ఆనకట్టకు నీరు చేరుతోంది. దీంతో ఆర్డీఎస్ కాల్వకు సకాలంలో నీటిని విడుదల చేస్తారు. మరో 24 గంటల్లో ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్‌కు నీరు చేరే అవకాశం ఉందని ఆర్డీఎస్ అధికారులు చెబుతున్నారు. టీబీ డ్యాం నుంచి విడుదలైన నీరు తుమ్మిళ్ల లిఫ్ట్‌కు చేరగానే మోటారు ఆన్‌చేసి ఆర్డీఎస్ కాల్వకు నీటిని విడుదల చేయాలని, అంతేగాక ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ నుంచి వెంటనే గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసి ఆర్డీఎస్ రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

నిండుకుండలా..

వారం రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యాం (టీబీ డ్యాం) పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరడంతో నిండుకుండను తలపిస్తోంది. ఎగువ నుంచి వస్తున్న 81,030 క్యూసెక్కుల నీటిని ఎప్పటికప్పుడు దిగువ తుంగభద్ర నదిలోకి విడుదల చేస్తున్నట్లు ఆర్డీఎస్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. డ్యాం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలుకాగా.. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో 102.576 టీఎంసీలు ఉందన్నారు. 1632.20 అడుగుల మేర నీటిని డ్యాంలో నిల్వ ఉంచి 20 గేట్లు రెండు అడుగుల మేర, 8 గేట్లు అడుగుమేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు. డ్యాం నుంచి విడుదలవుతున్న 71,262 క్యూసెక్కులతో పాటు వర్షాల ద్వారా వస్తున్న నీటితో కలిపి 75,774 క్యూసెక్కుల నీరు తుంగభద్రనదికి చేరుతున్నట్లు పేర్కొన్నారు.



నిండుకుండను తలపిస్తున్న తుంగభద్ర డ్యాం

అప్రమత్తంగా ఉండాలి..

తుంగభద్ర డ్యాం నుంచి విడుదలవుతున్న నీటితో పాటు వర్షం నీరు నదిలోకి చేరుతుండటంతో నది తీరప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని నీటిపారుదలశాఖ అధికారులు సూచించారు. వర్షాలు ఎక్కువైతే వరద ఉధృతి ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు.

వెంకన్న ఆలయానికి పూర్వ వైభవం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని పురాతన లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. ఆలయ రాతి కట్టడానికి సున్నం, పెయింటింగ్ వేయడంతో సహజత్వం కోల్పోయి ప్రాచుర్యం తగ్గుతూ వస్తోంది. పెయింటింగ్‌తో ఆలయం ఇటీవలే నిర్మించారన్న భావన భక్తుల్లో కలగుతోంది. దీంతో పూర్వ కాలంలో ఉన్నట్లుగానే భక్తులకు కనిపించేలా తీర్చిదిద్దాలని ఆలయ ధర్మకర్త నరహరి భీంసేనాచార్య, భక్తబృందం సభ్యుడు కొత్త మధుతోపాటు మరికొందరు నిర్ణయించారు. కర్ణాటకలోని దేవసుగూరు ఆలయంలో గతేడాది పెయింటింగ్ తొలగించి సహజత్వం ఉట్టిపడేలా తీర్చిదిద్దడంతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అదే తరహాలో ఈ ఆలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు పనులు చేపడుతున్నారు. గర్భగుడి ద్వారం పెయింటింగ్ తొలగించటంతో నాటి శిల్పకళా వెలుగు చూసింది. అలాగే రాతి స్తంభాలకు ఉన్న పెయింటింగ్ ఎయిర్ కంప్రెసర్, శాండ్ ద్వారా తీసివేశారు. శ్రావణ మాసం ప్రారంభం నాటికి పూర్తి చేసేందుకు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం వరకు ఆలయం మూసివేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శనివారం యథావిధిగా స్వామివారి దర్శనం కల్పిస్తామని ప్రకటించారు.





పెయింటింగ్ తొలగించిన తర్వాత ఆలయ గర్భగుడి ద్వారం, స్తంభం

కల్లు దుకాణాలపై ఎస్‌టీఎఫ్ అధికారుల దాడులు

- విచ్చలవిడిగా నిషేధిత మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు గుర్తింపు
- బడా కల్లు కాంట్రాక్టర్‌పై కేసు నమోదు

గద్వాల రూరల్: జోగుళాంబ గద్వాల జిల్లాలో పదేళ్ల కాలంలోనే కల్లు సామ్రాజ్యాన్ని విస్తరించి, బడా కల్లు కాంట్రాక్టర్‌గా అవతారమెత్తిన వ్యక్తిపై ఎక్సైజ్ శాఖ ఎస్‌టీఎఫ్ (స్పెషల్ టాస్క్‌ఫోర్స్) అధికారులు కేసు నమోదు చేయడం సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. గద్వాలకు చెందిన సివిల్ సప్లయ్ కాంట్రాక్టర్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ అయిన ఓ బడా కల్లు కాంట్రాక్టర్ ఎలాంటి అనుమతులు లేకుండా మల్దకల్‌లో కల్లుడిపో ఏర్పాటుచేసి, అదే మండలంలోని సుమారు 20–25 గ్రామాలకు కల్తీకల్లు విక్రయిస్తున్న వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ ఎస్‌టీఎఫ్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈక్రమంలో బుధవారం హైదరాబాద్ నుంచి ఎస్‌టీఎఫ్ అధికారుల బృందం మల్దకల్ మండలంలోని ఇల్లీగల్ కల్లుడిపోతో పాటు సమీపంలోని కల్లు దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. కల్లు డిపోలో శాక్రీన్, ఆల్ప్రాజోలం, సీహెచ్ వంటి నిషేధిత ప్రమాదకర మత్తుపదార్థాలు లభించగా.. ఈ డిపో నుంచి సరఫరా అయ్యే కల్లు దుకాణాల్లో కూడా తనిఖీలు చేపట్టారు. అక్కడ విక్రయించే కల్లు శాంపిల్స్ తీసుకుని ల్యాబరేటరీలో పరీక్షలు నిర్వహించగా.. కల్లులో నిషేధిత మత్తు పదార్థాలు ఉన్నట్లు తేలింది. దీంతో కల్లు డిపోను నిర్వహించే బడా కల్లు కాంట్రాక్టర్‌తో పాటు మరో ముగ్గురిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

పరారీలో కల్లు కాంట్రాక్టర్..

అక్రమంగా నడుపుతున్న కల్లు డిపో నిర్వాహకులతో పాటు బడా కల్లు కాంట్రాక్టర్‌పై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు కావడంతో సదరు కాంట్రాక్టర్ బుధవారం రాత్రి నుంచే పరారీలో ఉన్నట్లు తెలిసింది. దీంతో ఎస్‌టీఎఫ్ అధికారులు అందుబాటులో ఉన్న సాధారణ వ్యక్తులను అరెస్టు చూపెట్టారు. పరారీలో ఉన్న సదరు కల్లు కాంట్రాక్టర్ తనపై కేసు ఎత్తేసుకునేలా తనకున్న రాజకీయ పలుకబడిని వినియోగిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ నేతతో పైరవీలు చేస్తున్నట్లు సమాచారం.

కల్తీకల్లు ఘటనలో ముగ్గురిపై కేసు

మల్దకల్: రాష్ట్ర నార్కోటిక్, ఎక్సైజ్, పోలీసు అధికారులు నిర్వహించిన సంయుక్త దాడుల్లో బుధవారం రాత్రి ముగ్గురిపై కేసునమోదు కాగా గురువారం ఒకరిని రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. నార్కోటిక్ అధికారులు బుధవారం మల్దకల్ కల్లు డిపోతోపాటు దుకాణాలపై మెరుపుదాడులు నిర్వహించారు. కల్లులతో పాటు, వ్యక్తుల నుంచి శాంపిల్స్ సేకరించారు. రాత్రి ఒంటిగంట వరకు చర్యలు చేపట్టారు. మత్తు మందు కలిపినట్లు నిర్ధారణ కావడంతో కల్లు దుకాణ నిర్వాహకుడు ధర్మేష్ గౌడ్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా అధికారులు సమాచారాన్ని గోప్యంగా ఉంచడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే ఘటనపై అధికారులు పూర్తి సమాచారం తెలుపలేదు.

నేడు కోయిల్‌సాగర్ నీటి విడుదల

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి శుక్రవారం కుడి, ఎడమ కాల్వల ద్వారా సాగునీటిని విడుదల చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. రెండేళ్ల నుంచి జూలై మూడో వారంలో నీటిని విడుదల చేస్తుండగా.. ఈసారి కూడా వానాకాలం పంటల సాగుకు నీటిని విడుదల చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 11.30 గంటలకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి కుడి, ఎడమ కాల్వల తూములు తెరిచి నీటిని వదులుతారు. అయితే ప్రాజెక్టులో కనీస నీటిమట్టం 26 అడుగులు ఉంటే సాగునీటిని వదిలేవారు. ప్రస్తుతం నీటి మట్టం 17.6 అడుగులే ఉన్నా సాగునీటిని వదలడానికి నిర్ణయించారు. జూరాలకు ఇన్‌ఫ్లో ఉన్నప్పుడు ఎత్తిపోతల ద్వారా రెండు పంపులు రన్ చేసి కోయిల్‌సాగర్‌కు నిరంతరం 630 క్యూసెక్కుల నీటిని అందించేవారు. దీంతో ప్రాజెక్టులో కనీస నీటిమట్టం కొనసాగిస్తూ వానాకాలం పంటలు పూర్తయ్యే వరకు నీటిని విడుదల చేసేవారు. అలాగే గొలుసు కట్టు చెరువులను సైతం నింపేవారు. కానీ, ప్రస్తుతం జూరాలకు ఇన్‌ఫ్లో ఉన్నప్పటికీ పంపులకు సాంకేతిక సమస్య తలెత్తిన కారణంగా నీటి విడుదల కొనసాగించడం లేదు. వానాకాలం ముందు ప్రాజెక్టు నీటిమట్టం 10.6 అడుగులకు పడిపోయిన దశలో జూరాల నీటిని అందించడం వల్ల 7 అడుగుల మేర పెరిగి 17.6 అడుగులకు చేరుకుంది. అయితే త్వరలో పంపులను మరమ్మతు చేసి జూరాల నుంచి కోయిల్‌సాగర్‌కు నీటిని పంపింగ్ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

'పాలమూరు- రంగారెడ్డి'కి జాతీయ హోదా ఇవ్వాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు వెంటనే కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలని టీఎన్‌వీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. గురువారం ఆయన పాలమూరు యూనివర్సిటీలో విద్యార్థులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన బడ్జెట్‌లో పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు కోసం అధిక నిధులు కేటాయించలేదని, దీంతో పాలమూరు ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. వ్యవసాయధారమైన పాలమూరు జిల్లాకు ప్రాజెక్టులు ఎంతో కీలకమన్నారు. ప్రాజెక్టు పూర్తయితే లక్షలాది ఎకరాలకు సాగునీరు, వేలాది గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. కేంద్రం నిధులు కేటాయించకపోతే పాలమూరుకు చెందిన బీజేపీ నాయకులు ఎందుకు స్పందించడం లేదని, ప్రభుత్వంతో చర్చించి హోదా కోసం కృషి చేయాలన్నారు. పీయూ జేఏసీ నాయకులు బత్తిని రాము, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన మక్తల్ సర్వేయర్



ఏసీబీకి చిక్కిన సర్వేయర్ బాలరాజు

- రూ.9 వేలు లంచం ఇస్తుండగా పట్టుకున్న అధికారులు

మక్తల్: భూమి సర్వే చేసేందుకు ఓ రైతు నుంచి లంచం తీసుకుంటున్న సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన గాసం వెంకటేష్‌కు మండలంలోని మంతన్‌గోడ్ శివారులో సర్వే నంబర్లు 121, 107లో 12 ఎకరాల భూమి ఉంది. అయితే మోఖ మీద భూమి లేదని దీనిని సర్వే చేయాలని గత నెల 22న మీసేవలో దరఖాస్తు చేసి.. సర్వేయర్ బాలరాజుకు విన్నవించారు. 26న స్పాట్‌కు వెళ్లి హద్దులు నిర్ణయిస్తామని చెప్పినా రాలేదు. దీంతో ఈ నెల 6న సర్వే చేయాలని గాసం వెంకటేష్ అల్లుడు శ్రావణ్‌కుమార్ సర్వేయర్‌ను కోరగా రూ.12 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో మొదటి విడత రూ.3 వేలు ఇచ్చి సర్వే కోసం పిలవగా.. మిగతా డబ్బులు కూడా ఇవ్వాలని పట్టుబట్టాడు. దీంతో శ్రావణ్‌కుమార్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు గురువారం గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సాయంత్రం 6 గంటలకు శ్రావన్‌కుమార్ రూ.9 వేలు సర్వేయర్ బాలరాజుకు ఇస్తుండగా.. వెంటనే ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్, సీఐలు లింగస్వామి, జిల్లానీ పట్టుకున్నారు. ఈ మేరకు సర్వేయర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని, శుక్రవారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే డయల్ 1064 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

గట్టు లిఫ్టును త్వరగా పూర్తి చేయండి

గట్టు: గట్టు ఎత్తిపోతల పథకానికి ఎక్కువగా నిధులను కేటాయించి, త్వరగా పనులను పూర్తి చేసేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వం గట్టు లిఫ్టు నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలన్నారు. 30ఏళ్లుగా గట్టు లిఫ్టు చేస్తామని పాలకులు చెబుతూ వచ్చారని, లిఫ్టును పూర్తి చేసేందుకు సరైన విధంగా నిధులను కేటాయించడం లేదని ఆరోపించారు. బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులను కేటాయించి, ఏడాదిలోపే పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భారత్‌మాల ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణంలో భూములను సేకరించిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లించడంతో పాటుగా ఇంటికో ఉద్యోగం ఇవ్వాలన్నారు. వానాకాలం సిజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తుందని, ప్రభుత్వం రైతు భరోసా నిధులను తక్షణం రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఆర్డీఎస్ ద్వారా 15 టీఎంసీల నీటిని వాడుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు కొండన్న, పార్వతమ్మ, అనంతమ్మ, శివమ్మ, విజయేంద్రుడు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



గట్టులో మాట్లాడుతున్న గోపాల్

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు



పంట పొలాలలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

పాన్‌గల్: పంట పొలాల్లోకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లినన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి నుంచి కొల్లాపూర్, కొల్లాపూర్ నుంచి వనపర్తికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులు తెల్లరాళ్లపల్లితండా సమీపంలోని మలుపు వద్ద రెండూ ఎదురెదురుగా దూసుకొచ్చాయి. వెంటనే అప్రమత్తం అయిన డ్రైవర్లు రోడ్డు పక్కన పంట పొలాలకు బస్సులను తీసుకెళ్లారు. కొందరు ప్రయాణికులు భయపడి అత్యావసర ద్వారం నుంచి కిందకు దూకారు. ఒక బస్సు డ్రైవర్‌కు స్వల్ప గాయాలు తప్ప ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. రెండు బస్సులలో కలిపి 50 మంది వరకు ఉంటారని ఆర్టీసీ కండక్టర్లు పేర్కొన్నారు.

జల్సాలకు అలవాటుపడి చోరీలు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

- నిందితుడు అరెస్టు, రిమాండ్
- వివరాలు వెల్లడించిన నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట: జల్సాలకు అలవాటుపడి సినీ ఫక్కీలో చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ వెల్లడించారు. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం చేపనపేటకు చెందిన అప్పలనాయుడు అలియాస్ నాయుడు (43) సినీ ఫక్కీలో చోరీలకు పాల్పడుతూ, జల్సాలు చేయడంతో పాటు షార్ట్ ఫిలింలు తీసేవాడు. డబ్బులు అయిపోయాక మళ్లీ చోరీలకు పథకం రచించేవాడు. ఈ క్రమంలోనే గత మే 4వ తేదీన మరికల్‌లో, 7న నారాయణపేటలో, 8న మక్తల్ మండలంలోని సంగంబండ ద్వారకానగర్‌లో చోరీలకు పాల్పడ్డాడు.

జైలుశిక్ష అనుభవించినా మారని తీరు..

నిందితుడు అప్పలనాయుడు గతంలో హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ ప్రాంతాల్లో పలు దొంగతనాల కేసుల్లో అరెస్టయి జైలుశిక్ష అనుభవించాడు. 2021లో జైలు నుంచి బయటికి వచ్చాడు. ఐదు నెలల వ్యవధిలోనే మక్తల్, మరికల్, నారాయణపేట పట్టణాల్లో 6 చోరీలకు పాల్పడి.. సుమారుగా 75.1 తులాల బంగారం, 35 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ. 4 లక్షల నగదు అపహరించాడు. గురువారం మక్తల్ శివారులో పోలీసులు నిందితుడిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. అతడిని కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. డీఎస్పీ ఎన్.లింగయ్య పర్యవేక్షణలో నిందితుడిని పట్టుకున్న సీఐలు చంద్రశేఖర్, రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఐలు భాగ్యలక్ష్మీరెడ్డి, మురళి, కానిస్టేబుల్స్ రవీంద్రనాథ్, తిరుపతిరెడ్డి, నరేష్ యాదవ్, అశోక్ కుమార్, శ్రీకాంత్, ఐటీకోర్ శ్రీనివాసులుకు రివార్డులు అందజేశారు.

రెండు గ్రామాల్లో పట్టపగలే చోరీ

- బంగారం, వెండి, నగదు అపహరణ

ఊట్కూర్: మండలంలోని చిన్నపొర్ల, పెద్దపొర్ల గ్రామాల్లో గురువారం పట్టపగలే రెండు ఇళ్లలో దొంగతనాలు జరిగిన ఘటనలు చోటుచేసుకున్నాయి. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దపొర్లలో సోమమోళ్ల సాబమ్మ మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి చిన్నపొర్లలోని బ్యాంకుకు వెళ్లింది. సాయంత్రం వచ్చి చూడగా ఇల్లు తెరిచి ఉండడంతో లోపలికి వెళ్లి చూసింది. ఇంట్లో బీరువా తలుపులు పగులగొట్టి ఉన్నాయి. కాగా అందులో ఉన్న రెండు తులాల బంగారం నగలు, రూ. 90 వేలు కనపడలేదని ఆమె తెలిపారు.

చిన్నపొర్లలో..

చిన్నపొర్లలో చవటి బాలప్ప ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి పొలానికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చి చూడగా ఇల్లు తెరచి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరచి ఉంది. కాగా అందులో ఉన్న 5 గ్రాముల బంగారం, 55 తులాల వెండి గొలుసులు, రూ. 20 వేలు నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. ఘటనలపై హెడ్ కానిస్టేబుల్ సురేందర్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఐఏఎస్ స్మితా సబర్వాల్‌పై ఫిర్యాదు

జడ్చర్ల: దివ్యాంగులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ స్మితా సబర్వాల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురువారం ఏఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బిచ్చానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాల్లో దివ్యాంగుల కోటాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన స్మితా సబర్వాల్‌ను విధుల నుంచి తొలగించాలని కోరారు.



సాక్షి ఫ్యామిలీ IV
మహబూబ్‌నగర్
శుక్రవారం ॥ 26-7-2024

పాలక్... పన్నీరు

మనసున్న పాట

పాలక్ ముచ్చల్ అనే పేరు వినిపించగానే తీయటి పాట ఒకటి గుర్తొస్తుంది సింగర్‌గా మంచి పేరు తెచ్చుకున్న పాలక్ సామాజిక సేవలోనూ తన వంతుగా కృషి చేస్తోంది. ఫండింగ్ ద్వారా ఇప్పటి వరకు మూడు వేల మంది పేద పిల్లలకు గుండె ఆపరేషన్‌లు చేయించింది.



బాలీవుడ్ సినిమా 'ఎంఎస్ దోని-ది అన్ టోల్డ్ స్టోరీ'లోని 'కౌన్ తుఝే' పాటతో ఎంతోమంది అభిమానులను సంపాదించు కుంది పాలక్. ఇండోర్‌కు చెందిన పాలక్‌కు కాలేజీ రోజుల నుంచి పాటతో పాటు సేవా బాటలో పయనించడం అంటే కూడా ఇష్టం.

పాలక్ తొలి ఫండ్ రైజింగ్ ప్రాజెక్ట్ కార్గిల్ వీర సైనికుల కోసం చేసింది. ప్రతి షాప్ ముందుకు వెళ్లి దేశభక్తి గీతాలు పాడి 'కార్గిల్ వీర సైనికులకు మీ వంతుగా సహాయం చేయండి' అని అడిగేది.

కళ, సామాజిక సేవను పాలక్ వేరు చేసి చూడదు. మూడు వేల మంది పేద పిల్లలకు గుండె ఆపరేషన్‌లు చేయించడానికి తనలోని కళ బలమైన మాధ్యమంగా ఉపయోగపడుతుందని చెబుతుంది పాలక్.

సినిమాల్లో అవకాశాలు దొరకని రోజుల్లో కూడా ఎన్నో ప్రోగ్రామ్స్ చేసి పేద పిల్లల కోసం విరాళాలు సేకరించేది.

పాలక్ ఒక మ్యూజిక్ ప్రోగ్రామ్ చేసిందంటే పది మంది పేద పిల్లల వైద్యానికి అవసరమైన డబ్బును సేకరించినట్లే. బాలీవుడ్‌లో సింగర్‌గా పాలక్‌కు మంచి పేరు రావడమే కాదు ఆ పేరు విరాళాల సేకరణకు బాగా ఉపయోగపడింది.

'మీ పాట అద్భుతం' అనే ప్రశంస కంటే, పేదింటి తల్లిదండ్రుల గొంతు నుంచి వినిపించే...

'మీ వల్ల మా బిడ్డ బతికింది' అనే మాట పాలక్‌కు ఎక్కువ సంతృప్తి ఇస్తుంది. ఇప్పుడు పాలక్ వెయిటింగ్ లిస్ట్‌లో 413 మంది పిల్లలు ఉన్నారు. వారికి హార్ట్ సర్జరీలు చేయించాల్సిన బాధ్యతను భుజాలకెత్తుకుంది.

'మనస్ఫూర్తిగా కోరుకుంటే అంతా మంచే జరుగుతుంది. పేదపిల్లలకు అండగా నిలవడానికి ఇది దేవుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తాను' అంటుంది పాలక్ ముచ్చల్.

ఫ్యాషన్



గ్రామీణ మహిళా కళాకారులను ప్రోత్సహించడానికి, వారి వారసత్వ కళను, ఫ్యాబ్రిక్ క్రాఫ్ట్‌ను భారతదేశం అంతటా పరిచయం చేయడానికి ది వోవెన్ ల్యాబ్ పేరుతో కృషి చేస్తున్నారు భూపాల్ వాసి నిఖితా కౌశిక్. ముంబైలోని నిఫ్ట్ పూర్వవిద్యార్థి అయిన నిఖిత జీరోవేస్ట్ పాలసీతో పాతికమంది గ్రామీణ మహిళల చేత పట్టణ మహిళల కోసం ఆధునికంగా డ్రెస్‌లను డిజైన్ చేయించి, వారికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'స్టైల్ తత్త్వ' ఎగ్జిబిషన్‌లో క్రాఫ్ట్స్, హ్యాండ్లూమ్ క్లస్టర్స్‌కి వారధిగా ఉంటూ చేస్తున్న కృషిని వివరించారు.

సిటీకి పల్లె కళ

''ఈ రోజు మనం భారతీయులమని చెప్పుకోవడానికి గర్విస్తున్నామంటే మన దేశంలోని విభిన్న సంస్కృతులూ, సంప్రదాయాలూ కారణం. వేటికవి సొంత మార్గాలలో ప్రత్యేకమైనవి. ఫలితంగా మన జీవితంలో దుస్తులు ముఖ్యమైన అంశంగా మారాయి. మన గ్రామీణ మహిళా కళాకారుల హస్తకళ శిల్ప నైపుణ్యాన్ని చేతితో నేసిన వస్త్రాలను మరింత మెరుగుపరచడంలో మా పని కీలకంగా ఉంటుంది. చిట్ట చివరగా ఉపయోగించే చిన్న ఫ్యాబ్రిక్ పీస్‌తో కూడా 'కళ'ద్వారా అందంగా డిజైన్ చేస్తాం. ఇందుకోసం నిరంతరం పరిశోధన జరుగుతూనే ఉంటుంది. అందుకే, మా బ్రాండ్‌కు 'ది వోవెన్ ల్యాబ్' అని పేరు పెట్టాం.



నిఖితా కౌశిక్

జీరో వేస్ట్ పాలసీ

రాజస్థాన్, గుజరాత్ భోపాల్.. ప్రాంతాల్లోని గ్రామీణ, గిరిజన మహిళల చేతుల్లో రూపుదిద్దుకున్న మా దుస్తుల డిజైన్స్ బయట షాపుల్లో లభించవు. ఎగ్జిబిషన్లు, ఆన్‌లైన్ ద్వారా అమ్మకం చేస్తుంటాం. మన దేశీ కాలా పత్తితో పాటు టెన్సెల్, రీసైకిల్ ఫ్యాబ్రిక్స్, పర్యావరణ అనుకూలమైన క్లాత్‌తోనే డిజైన్ చేస్తున్నాం. అరుదైన కాటన్ ఫ్యాబ్రిక్, ప్రాచీన కళా వైభవం గల మోడర్న్ డిజైనరీ డ్రెస్సులు కాబట్టే వీటి ఖర్చు ఎక్కువే. కానీ, ఎక్కడ ఉన్నా ప్రత్యేకతను చాటుతుంటాయి.

మహిళా సాధికారత

మా సంస్థకు ఉన్న బలమైన స్తంభాలలో ఒకటి మహిళా సాధికారత. ఇప్పటికి పాతిక మంది గ్రామీణ మహిళలు ఈ డిజైన్స్ కోసం కృషి చేస్తున్నారు. కళ పట్ల ఆసక్తి ఉన్న గ్రామీణ బాలికలను ఎంపిక చేసుకొని, శిక్షణ ఇవ్వడమే కాకుండా, వారి ప్రాథమిక విద్య కూడా సవ్యంగా జరిగేలా చూస్తున్నాం. ఒక డ్రెస్ కొనుగోలు చేస్తే ఆ మొత్తంతో ఆ కళాకారుల ఇల్లు నెలంతా ఏ ఇబ్బంది లేకుండా గడిచిపోతుంది. భవిష్యత్తు తరాలు ఆ కళావైభవాన్ని సొంతం చేసుకోవాలన్నదే నా కల. చాలావరకు సేకరించే కాటన్ ఫ్యాబ్రిక్ ఐవరీ, గ్రే కలర్ వే ఎంచుకుంటాం. కొన్నింటికి మాత్రం నేచురల్ రంగులతో డైయింగ్ ప్రక్రియ ఉంటుంది. వ్యర్థాలను నివారిస్తూ, పర్యావరణ అనుకూలమైన ఉత్పత్తులను వెలుగులోకి తీసుకురావాలన్నదే మా ప్రయత్నం తప్ప ఫాస్ట్ ఫ్యాషన్ పోటీ పరుగులో చేరం.

రాబోయే తరాలకు మన కళ

ప్రాచీన హ్యాండ్ వర్క్స్‌ని వదిలేస్తే అవి అంతే సులువుగా మరుగున పడిపోతాయి. క్రాఫ్ట్స్ క్లస్టర్స్ ఆఫ్ ఇండియాతో అనుబంధంగా వర్క్ చేస్తున్నాను కాబట్టి దేశంలోని హ్యాండ్లూమ్ క్లస్టర్స్‌తోనూ, ఈ మార్గంలో వచ్చే అంతరాలను పూడ్చేందుకు నిఫ్ట్‌లోని వివిధ కేంద్రాలతో అనుబంధంగా వర్క్ చేస్తున్నాను.

ఫ్యాబ్రిక్ సేకరణ, డిజైన్స్ సృష్టి, వ్యర్థాలు మిగలకుండా జాగ్రత్తపడటం అనేది ఓ సవాల్‌గా ఉంటుంది. కానీ, పర్యావరణ హితంగా, మనసుకు నచ్చిన పని చేస్తుండటం ఎప్పుడూ ఉత్సాహాన్ని ఇస్తుంది. అంతేకాదు, ఈ డిజైన్స్‌ని ఇష్టపడి కొనుగోలు చేసేవారి ద్వారా ప్రాణం పెట్టే కళాకారులకు ఉపాధి పొందేలా చేయడం మరింత సంతృప్తిని ఇస్తుంది'' అని వివరించారు ఈ డిజైనర్.

- నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

వంటిల్లు

ఇది పకోడీ కాలం

ఇది వర్షాకాలం. వాన చినుకులు పడుతుంటే... వేడి వేడి పకోడీలు తింటూ గరం గరం చాయ్ తాగుతూ ఉంటే ఎలా ఉంటుంది? ఏడాదంతా వర్షాకాలమే ఉంటే బావుణ్ణనిపిస్తుంది. ఇది వర్షాకాలం కాదు పకోడీల కాలం అనాలనిపిస్తుంది.

పోహా పకోడీ



కావలసినవి: అటుకులు– ఒకటిన్నర కప్పులు; బంగాళాదుంప– అర కప్పు (ఉడికించి చిదిమినది); కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు; పచ్చిమిర్చి తరుగు– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; చక్కెర – అర టీ స్పూన్; నిమ్మరసం – అర టీ స్పూన్; జీలకర్ర– అర టీ స్పూన్; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె– వేయించడానికి తగినంత.

తయారీ: ● అటుకులను ఒక పాత్రలో వేసి (అటుకులు తేలేటట్లు) నిండుగా నీటిని పోసి కడిగి వడపోత గిన్నెలో వేయాలి ● నీరంతా కారిపోయిన తర్వాత తీసి వెడల్పు పాత్రలో వేసుకోవాలి. అందులో ఉడికించి చిదిమిన బంగాళాదుంప, కొత్తిమీర, పచ్చిమిర్చి, మిరప్పొడి, చక్కెర, జీలకర్ర, నిమ్మరసం, ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం అంతటినీ చిన్న నిమ్మకాయంత గోళీలుగా చేసుకోవాలి ● బాణలిలో నూనె వేడి చేసి, మరుగుతున్న నూనెలో ఒక్కో గోళీని మెల్లగా వేయాలి. మంటను మీడియంలో పెట్టి దోరగా వేగనివ్వాలి. అన్నివైపులా ఎర్రగా వేగిన తర్వాత చిల్లుల గరిటతో తీసి టిష్యూ పేపర్ మీద వేస్తే పోహా పకోడీ రెడీ. వీటికి పుదీన చట్నీ లేదా టొమాటో కెచప్ మంచి కాంబినేషన్.

కార్న్ పకోడీ



కావలసినవి: స్వీట్ కార్న్ గింజలు– 2 కప్పులు; అల్లం వెల్లుల్లి పేస్ట్ – 2 టీ స్పూన్‌లు; జీలకర్ర– అర టీ స్పూన్; శనగపిండి– 3 టేబుల్ స్పూన్‌లు; బియ్యప్పిండి– 3 టేబుల్ స్పూన్‌లు; గరం మసాలా – అర టీ స్పూన్; ఉల్లిపాయ – ఒకటి (తరగాలి); పచ్చిమిర్చి – 2 (తరగాలి); కరివేపాకు – 2 రెమ్మలు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పసుపు – పావు టీ స్పూన్; మిరప్పొడి– అర టీ స్పూన్; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● మొక్కజొన్న గింజలను కడిగి చిల్లుల పాత్రలో వేసి నీరు పోయే వరకు ఉంచాలి ● ఈ లోపు ఒక పాత్రలో నూనె మినహా పైన తీసుకున్నవన్నీ వేసి కలపాలి ● మొక్కజొన్న గింజల్లో గుప్పెడు గింజలను తీసి పక్కన పెట్టి మిగిలిన గింజలను మిక్సీలో కచ్చపచ్చాగా గ్రైండ్ చేయాలి. ఇప్పుడు పక్కన పెట్టిన గింజలను కూడా శనగపిండి మిశ్రమంలో వేసి కలపాలి ● బాణలిలో నూనె మరిగించి పకోడీ మిశ్రమాన్ని చేతిలోకి తీసుకుని వేళ్లతో కొద్దికొద్దిగా నూనెలో వేయాలి. దోరగా వేగిన తర్వాత తీసి టిష్యూ పేపర్ మీద వేస్తే వేడి వేడి కార్న్ పకోడీలు తినడానికి రెడీ. ఇలాగే పిండినంతటినీ చేసుకోవాలి.

సినిమా

మహేశ్‌బాబు గోల్డ్?



హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లోని సినిమా అంతర్జాతీయ స్థాయిలో రూపొందనున్న సంగతి తెలిసిందే. దీంతో ఈ సినిమా ప్రతి అప్‌డేట్ ప్రపంచవ్యాప్త సినీ ప్రేమికులకు ఆసక్తికరంగా అనిపిస్తోంది. తాజాగా ఈ సినిమాకు 'గోల్డ్' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో బలంగా వినిపిస్తోంది. గతంలో 'మహారాజా', 'మహారాజ్' వంటి పేర్లు తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. లేటెస్ట్‌గా 'గోల్డ్' టైటిల్ వినిపిస్తోంది. ఆఫ్రికన్ ఫారెస్ట్ అడ్వెంచరస్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమా ప్రధాన కథాంశం ఓ నిధి వేట అనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఇప్పుడు ఈ సినిమాకు 'గోల్డ్' అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నారనే వార్త రావడంతో నిధి నేపథ్యం కాబట్టి ఈ టైటిల్‌నే ఖరారు చేస్తారనే చర్చ జరుగుతోంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్‌ను రచయిత విజయేంద్ర ప్రసాద్ పూర్తి చేశారని, హైదరాబాద్‌లో సెట్ వర్క్ జరుగుతోందని, జర్మనీలో కొంత చిత్రీకరణను ప్లాన్ చేశారని తెలుస్తోంది. షూటింగ్‌ను ఈ ఏడాదిలోనే ప్రారంభించాలనుకుంటున్నారు మేకర్స్.

పాఠాలు నేర్పినవారందరికీ ధన్యవాదాలు



● శ్రుతీహాసన్

హీరోయిన్‌గా పదిహేనేళ్ల విజయవంతమైన కెరీర్‌ని పూర్తి చేసుకుంటూ, ఇంకా అగ్ర శ్రేణి హీరోయిన్ల జాబితాలో ఒకరిగా రాణిస్తుండటం అంటే అంత సులభమైన విషయం కాదు. ఈ లిస్ట్‌లో చాలా తక్కువమంది హీరోయిన్లు ఉంటారు. తాజాగా శ్రుతీహాసన్ పేరు ఈ లిస్ట్‌లో చేరింది. తండ్రి కమల్‌హాసన్ నటించిన ద్విభాషా (తమిళం, హిందీ) చిత్రం 'హే రామ్' (2000)లో చైల్డ్ ఆర్టిస్టుగా తొలిసారి స్క్రీన్‌పై కనిపించారు శ్రుతీహాసన్. చైల్డ్ ఆర్టిస్టుగా మరో సినిమా చేయలేదు కానీ.. 'హే రామ్' రిలీజైన తొమ్మిదేళ్లకు హిందీ చిత్రం 'లక్' (2009)తో కథానాయికగా కెరీర్‌ను ఆరంభించారు శ్రుతి. ఆ తర్వాత సూర్య 'సెవెన్త్ సెన్స్', ధనుష్ 'త్రీ', రామ్ చరణ్ 'ఎవడు', అల్లు అర్జున్ 'రేసుగుర్రం' రవితేజ 'క్రాక్' .. ఇటీవల చిరంజీవి 'వాల్తేరు వీరయ్య', ప్రభాస్ 'సలార్: సీజ్‌ఫైర్' వంటి చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించారు శ్రుతి. నటిగా–గాయనిగా–సంగీత దర్శకురాలిగా... ఇలా మల్టీ టాలెంట్‌తో దూసుకెళుతున్నారు శ్రుతీహాసన్. కథానాయికగా పదిహేనేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రుతీహాసన్ స్పందిస్తూ – ''అప్పుడే పదిహేనేళ్లు పూర్తయ్యాయంటే నమ్మశక్యంగా లేదు. నేను పెరిగిన మ్యాజికల్ ఇండస్ట్రీలోనే ఇంతకాలం నేను ఉన్నందుకు చాలా సంతోషంగా ఉంది. నా మిగతా జీవితాన్ని కూడా ఇండస్ట్రీతోనే ముడివేస్తాను. ఇండస్ట్రీలో నాకు అందమైన పాఠాలు నేర్పినవారందరికీ ధన్యవాదాలు. అలాగే నన్ను ఆదరించిన ప్రేక్షకులు, నా అభిమానులకు థ్యాంక్స్. వీళ్లే లేకపోతే నేను ఇలా ఉండేదాన్ని కాదు'' అన్నారు. రజనీకాంత్ 'కూలీ', ప్రభాస్ 'సలార్: శౌర్యంగాపర్వం', అడవి శేష్ 'డెకాయిట్' చిత్రాల్లో నటిస్తున్నారు శ్రుతీహాసన్.

తనికెళ్ల భరణికి డాక్టరేట్



ప్రముఖ నటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణికి వరంగల్ ఎస్ఆర్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. తనికెళ్ల భరణి దాదాపు 800లకు పైగా సినిమాల్లో నటించి ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 52 సినిమాలకు మాటలు అందించారాయన. 'సముద్రం' సినిమాకి ఉత్తమ విలన్‌గా, 'నువ్వు నేను' చిత్రానికి ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్టుగా, 'గ్రహణం' చిత్రంతో ఉత్తమ నటునిగా, 'మిథునం' సినిమాకిగాను ఉత్తమ రచయిత–ఉత్తమ దర్శకునిగా నంది అవార్డులు అందుకున్నారాయన. ఇక ఆగస్ట్ 3న వరంగల్‌లో జరిగే యూనివర్సిటీ స్నాతకోత్సవంలో తనికెళ్ల భరణికి డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు.

మళ్లీ తల్లి కాబోతున్నాను



● ప్రణీత


'ఏం పిల్లో ఏం పిల్లడో', 'బావ', 'పాండవులు పాండవులు తుమ్మెద, రభస, బ్రహ్మోత్సవం' వంటి సినిమాల్లో నటించిన ప్రణీత తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే. ఇక వ్యక్తిగత విషయానికి వస్తే... 2021 మే 30న వ్యాపారవేత్త నితిన్ రాజుతో ప్రణీత వివాహం జరిగింది. 2022 జూన్‌లో ప్రణీత ఓ పాపకు జన్మనిచ్చారు. కొన్ని నెలలు సినిమాలకు విరామం తీసుకున్నాక ఆమె కన్నడలో చేసిన ఒక సినిమా, మలయాళంలో చేసిన ఒక సినిమా ఈ ఏడాది విడుదలయ్యాయి. కాగా తాను రెండోసారి తల్లి కాబోతున్నట్లు పేర్కొన్నారు. 'రౌండ్ 2.. ఇప్పటి వరకూ నేను వాడిన పాంట్స్ ఇక నాకు ఫిట్ కావు'' అంటూ బేబీ బంప్ ఉన్న ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు ప్రణీత.

హారర్... థ్రిల్



● ప్రియా భవానీ శంకర్

అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన తమిళ చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. అజయ్ ఆర్. జ్ఞానముత్తు దర్శకత్వం వహించారు. విజయ సుబ్రహ్మణ్యన్, ఆర్.సి.రాజ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టులో విడుదల కానుంది. రాజ్ వర్మ ఎంటర్‌టైన్‌మెంట్– శ్రీ బాలాజీ ఫిలింస్ తెలుగులో విడుదల చేస్తున్నాయి. ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు రామ్ గోపాల్ వర్మ రిలీజ్ చేసి, 'ట్రైలర్ ఆసక్తిగా ఉంది. సినిమా హిట్టవ్వాలి' అన్నారు. కాగా అజయ్ ఆర్. జ్ఞానముత్తు దర్శకత్వంలో వచ్చిన 'డీమాంటీ కాలనీ'కి సీక్వెల్‌గా 'డీమాంటీ కాలనీ 2' రూపొందింది. ''హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ఇది. డీమాంటీ ఇంట్లో అనూహ్యమైన ఘటనలు జరుగుతుంటాయి. ఆ ఇంట్లో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు వెళ్లిన వారు చనిపోతుంటారు. ఇంతకీ ఆ ఇంట్లో ఉన్న ఆ శక్తి ఏంటి? చివరగా వెళ్లినవారు ఎలా ప్రాణాలు కాపాడుకున్నారు?' అనేది 'డీమాంటీ కాలనీ 2'లో ఆసక్తిగా ఉంటుంది'' అన్నారు మేకర్స్.



● రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా

తెగబడవేమీ...

రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా ఏఎస్ రవి కుమార్ చౌదరి దర్శకత్వం వహించిన చిత్రం 'తిరగబడరసామీ'. మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 2న రిలీజ్ కానుంది. తాజాగా ఈ చిత్రం టైటిల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. 'కత్తులు దిగనీ నెత్తురుతోని తడపర భూమి తెగబడవేమీ...' అంటూ సాగే ఈ పాటకి జేబీ సంగీతం అందించారు. సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించిన ఈ పాటని సాయి చరణ్, లోకేశ్వర్ ఈదర, చైతు సత్సంగి పాడారు. ''యూత్‌ని ఆకట్టుకునే రొమాన్స్‌తో పాటు ఫ్యామిలీని ఆకర్షించే సెంటిమెంట్, మాస్‌ని అలరించే హై ఓల్టేజ్ యాక్షన్ అంశాలతో 'తిరగబడర సామీ' రూపొందింది. టీజర్, ట్రైలర్, పాటలు సినిమాపై క్యూరియాసిటీని పెంచాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

రక్షించండి!



● 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబ' పోస్టర్

తాప్సీ నటించిన రొమాంటిక్ థ్రిల్లర్ మూవీ 'హసీన్ దిల్‌రుబ' (2021) హిట్టయిన విషయం తెలిసిందే. విక్రాంత్ మెస్సీ మరో లీడ్ రోల్‌లో నటించిన ఈ సినిమాకు వినీల్ మాథ్యూ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబ' రూపొందింది. సీక్వెల్‌లోనూ తాప్సీ, విక్రాంత్ మెస్సీ లీడ్ రోల్స్‌లో నటించగా, వినీల్ మాథ్యూయే దర్శకత్వం వహించారు. ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'నాతో కలిసి నువ్వు సినిమాకు వస్తావా?' 'నన్ను రక్షించండి... నా భర్త నన్ను చంపబోతున్నాడు' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రం ఆగస్టు 9 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

సినిమా బాగుందని అంటారు

''సమాజంలోని ఒక అంశానికి వాణిజ్య అంశాలు జోడించి 'విరాజీ' తీశాం. ఈ సినిమాలో మంచి కంటెంట్ ఉంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని అంటారనే నమ్మకం ఉంది'' అని నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల అన్నారు. వరుణ్ సందేశ్ హీరోగా నటించిన చిత్రం 'విరాజీ'. ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా మహేంద్రనాథ్ మాట్లాడుతూ– ''వరలక్ష్మితో 'శబరి' సినిమా తర్వాత మా సంస్థలో నిర్మించిన రెండో చిత్రం 'విరాజీ'. ఆద్యంత్ హర్ష చెప్పిన కథని అంతే బాగా తెరకెక్కించారు. వరుణ్ సందేశ్ అమెరికా నేపథ్యం ఉన్న వ్యక్తి. అతని డైలాగ్ డెలివరీ విధానం 'విరాజీ'కి కలిసొచ్చింది. మా సినిమాని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ వాళ్లు నైజాంలో రిలీజ్ చేస్తున్నారు'' అన్నారు.



● మహేంద్రనాథ్

ఏమైందో మనసే...

'మెరిసే మెరిసే' చిత్ర దర్శకుడు పవన్ కుమార్ కొత్తూరి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. స్నేహా మాలవ్య, సాహిబా భాసిన్, వివియా సంత్ హీరోయిన్లుగా నటించారు. శ్రీ నీలకంఠ మహదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీపై రూపొందిన ఈ చిత్రం పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఆగస్ట్ 2న విడుదల కానుంది. కాగా 'ఏమైందో మనసే' అంటూ సాగే ఈ చిత్రంలోని రెండో పాటను రిలీజ్ చేశారు. ఈ పాటకు కార్తీక్ బి. కొడకండ్ల సంగీతం అందించారు. కృష్ణవేణి మల్లవజ్ఝల సాహిత్యం అందించగా, శక్తి శ్రీ గోపాలన్ పాడారు.



● పవన్, సాహిబా